కాంగ్రెస్ జిల్లా మీడియా కో-ఆర్డినేటర్‌గా మన్సూర్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కాంగ్రెస్ పార్టీ మీడియా అన్నమయ్య జిల్లా కో-ఆర్డినేటర్‌గా తనను పిసిసి చీఫ్ వైఎస్.షర్మిల నియమించినట్లు డిసిసి మైనార్టీ చైర్మన్ ఆడిటర్ మన్సూర్ అలీఖాన్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ చైర్మన్‌గా ఉన్న నన్ను, నా సేవలను గుర్తించి మరో పదవి ఇచ్చి నాపై బాధ్యతను మరింత పెంచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి, కార్యకర్తలకు, ప్రజలకు వారధిలాగా పనిచేసి పార్టీ బలోపేతనానికి కృషి చేస్తానన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసేంత వరకూ ఒక సైనికుడిలా పనిచేస్తానన్నారు. నా నియామకానికి సహకరించిన పిసిసి చీఫ్ షర్మిల, రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా గౌతమ్, డిసిసి అధ్యక్షులు అల్లాబకష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

టిడిపిలో తొలగని ఉత్కంఠ

- ఆ నాలుగు టికెట్లు గల్లంతే
- రాజంపేట బిజెపికే?
- జమ్మలమడుగులో ఫ్యామిలీ పేచీ!

టిడిపిలో టికెట్ల ఉత్కంఠ తొలగలేదు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు రెండు విడతల్లో కడప, అన్నమయ్య జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో తొమ్మిది స్థానాలకు టికెట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. తాజాగా శుక్రవారం మూడో విడత కింద ప్రకటించిన 11 అసెంబ్లీ టికెట్లలో జిల్లాల్లోని పెండింగ్ స్థానాల ప్రకటన లేకపోవడం ఉత్కంఠగా మారింది. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని జమ్మలమడుగు, బద్వేల్, రాజంపేట, రైల్వేకోడూరు అసెంబ్లీ టికెట్ల కేటాయింపు వ్యవహారం కొలిక్కి రాలేదు. ఆశావహుల్లో ఆశలు సన్నగిల్లినట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టిడిపిలో అనిశ్చితి రాజ్యమేలుతోంది. పొత్తు పేరుతో టికెట్లు కేటాయింపు పట్ల చూపుతున్న నాన్పుడు ధోరణి కనిపిస్తోంది. కడప జిల్లాలో కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్, అన్నమయ్య జిల్లాలో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లి, తంబళ్లపల్లి, పీలేరు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 13 అసెంబ్లీ స్థానాలకుగానూ రెండు విడతల్లో తొమ్మిది స్థానాలకు టికెట్లు ప్రకటించారు. మిగిలిన జమ్మలమడుగు, బద్వేల్, రాజంపేట, రైల్వేకోడూరు స్థానాలకు పొత్తు పేరుతో బిజెపి, జనసేన అభ్యర్థుల పేర్లు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. మూడవ విడతలో ప్రకటించే అవకాశం ఉందని ఆశించిన ఆశావహులకు నిరాశ తప్పలేదు.

రాజంపేట వయా విజయనగరం!

కడప, అన్నమయ్య జిల్లాలోని ఆ నాలుగు పెండింగ్ స్థానాల్ని బిజెపి, జనసేన అభ్యర్థులకు కేటాయించే అవకాశం కనిపిస్తోంది. రాజంపేట అసెంబ్లీ టికెట్‌ను బిజెపికి కేటాయించి, విజయనగరం టికెట్‌ను టిడిపి అంటిపెట్టుకునేందుకు అవసరమైన చర్చలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. రాజంపేట పార్లమెంట్ టికెట్‌ను సైతం బిజెపికి వదిలే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. పదేళ్లుగా పార్టీని బలోపేతం చేసుకున్న అసెంబ్లీ ఇన్‌ఛార్జులను పొత్తు పేరుతో నిరాకరిస్తుండటం కేడర్‌లో నిరుత్సాహం నెలకొంది. రాజంపేటలో వైసిపి, టిడిపి మధ్య హోరాహోరీగా సాగే అవకాశాలు ఉన్నాయనే అంచనాల నేపథ్యంలో బిజెపికి కేటాయించడమేమిటనే వాదన వినిపిస్తోంది. అన్నమయ్య జిల్లాలో మిగిలిన రైల్వేకోడూరు రిజర్వు స్థానాన్ని జనసేనకు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

'ఆది'లోనే హంసపాదు

జమ్మలమడుగు వ్యవహారం 'ఆది'లోనే హంసపాదు సామెతను తలపించింది. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణరెడ్డి పోటీ చేయడానికి సిద్ధమైన సంగతి తెలిసిందే. బిజెపి అధిష్టానం లాబీయింగ్ ద్వారా టికెట్ సాధించుకునేందుకు ప్రయత్నం చేశారు. ఆయన పోటీ చేయడం పట్ల కుటుంబంలో చీలిక రావడంతో వెనుకడుగు వేసినట్లు తెలుస్తోంది. రెండు నెలల కిందటి నుంచే జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తనదైన శైలిలో పాదయాత్ర నిర్వహిస్తూ ప్రజా సమస్యల ప్రస్తావన ద్వారా ప్రజలను ఆకట్టుకునే పనిలో నిమగ్నం కావడం తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో బిజెపి పొత్తులో భాగంగా కడప పార్లమెంట్ టికెట్‌ను అడుగుతున్నట్లు ప్రచారం నడుస్తోంది.

బద్వేల్ బరిలో ఎవరు..?

బద్వేల్ రిజర్వు స్థానంలో పోటీకి బిజెపి కసరత్తు చేస్తోంది. బద్వేల్ ఉప ఎన్నికలో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన పనతల సురేష్ పోటీ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఉప ఎన్నిక బరి నుంచి ప్రధాన ప్రతిపక్ష టిడిపి, జనసేన తప్పుకున్న సంగతి తెలిసిందే. ప్రతిపక్ష టిడిపి పరోక్ష మద్దతుతో బిజెపి అభ్యర్థికి 24 వేల ఓట్లు లభించిన సంగతి తెలిసిందే. ఇటువంటి పూర్వరంగంలో ప్రతిపక్ష టిడిపి, జనసేన సంయుక్త మద్దతుతో మరోసారి అధికార వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులతో తలపడేందుకు సిద్ధమైనట్లు కనిపిస్తోంది. కేంద్రంలోని బిజెపి సర్కారు సిఎఎ గైడ్‌లైన్స్ ఫ్రేమ్ చేసిన నేపథ్య ంలో 2,17,769 ఓటర్లలో 30 వేలు ముస్లిమ్, సుమారు 70 వేల దళితుల ఓట్లు తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంది. ఏదేమైనా పొత్తు ధర్మం పేరుతో బద్వేల్ టిడిపి అభ్యర్థిగా బరిలో నిలవనున్నట్లు ప్రచారమైన రోశన్నకు, రాజంపేటలో జగన్మోహన్‌రాజు, బత్యాల చెంగల్రాయులకు టికెట్ నిరాకరణ అనేది తేటతెల్లమవుతోంది.

నివేదికలు ఎప్పటికప్పుడు పంపాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ నుంచి రోజువారి నివేదికలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు పంపించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ నోడల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని విషయాలలో సిద్ధంగా ఉండాలన్నారు. ఫారం 6, ఎంసిసి, ఇఎస్ఎంఎస్, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి తదితర అంశాలకు సంబంధించిన నివేదికలను ప్రతిరోజు సిఇఒ కార్యాలయానికి తగిన సమయంలో చేరవేయాలన్నారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన రోజువారి నివేదికలను ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి అందజేయాలని తెలిపారు. ఈ విషయంలో ఎటువంటి అలసత్వాన్ని ప్రదర్శించరాదని నోడల్ అధికారులకు సూచించారు. సమావేశంలో ఎన్నికల విధులలో ఉన్న నోడల్ అధికారులు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

టోల్ ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోండి

ఎన్నికల ఫిర్యాదులు, ఇతర వివరాల కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబరును (1800 425 7090) సద్వినియోగం చేసుకోవాలని అభిషిక్త్ కిషోర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఫిర్యాదులు, ఇతర వివరాల కొరకు కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి ఫిర్యాదునైనా ఈ టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ టోల్ ఫ్రీ నెంబర్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. ఫిర్యాదుల కొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 1950కి అదనంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న అభిషిక్త్ కిషోర్

కార్పొరేట్ విద్యా సంస్థల్లో చేరొద్దు : ఎస్ఎఫ్ఐ

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కార్పొరేట్ చదువులు పిల్లల జీవితాలకు ఉరితాళ్లని, ఆర్భాటాల కోసం పిల్లలను కార్పొరేట్ కళాశాలల్లో చేర్చి వారి జీవితాలు నాశనం చేయొద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ముగుస్తున్న సందర్భంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ కళాశాలలో చేర్పించాలన్న సందిగ్ధంలో ఆర్భాటాలకు పోయి కార్పొరేట్ కళాశాలలో చేర్పిస్తుంటారని పేర్కొన్నారు. కార్పొరేట్ చదువులు పిల్లల జీవితాలను నాశనం చేస్తాయని చెప్పారు. ప్రతిభగల విద్యార్థులను ఒక సమూహంగా చేసి ర్యాంకుల కోసం వారిని ఆటపాటలకు దూరం చేసి మానసిక ఒత్తిడి తెచ్చి ఆత్మహత్యలకు పురికొల్పేలా చేస్తారని హెచ్చరించారు. చిన్న కళాశాలలు, ప్రభుత్వ కళాశాలల్లోనే అర్హత గల అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే సరైన బోధన ఉంటుందని తెలిపారు. కేవలం పత్రికలు, ప్రసార మాధ్యమాలలో ఊదరగొట్టుకోవడానికి కార్పొరేట్ కళాశాలలు విద్యార్థులను మానసికంగా హింసించి క్షోభకు గురి చేస్తారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కార్పొరేట్ కళాశాలల మాయాజాలాన్ని అర్థం చేసుకుని తమ పిల్లల భవిష్యత్తును చక్కదిద్దుకునేందుకు సరైన ప్రణాళిక ద్వారా ఉత్తమ కళాశాలలను ఎంచుకోవాలని తెలిపారు. కార్పొరేట్ విద్యా రంగాన్ని తరిమికొట్టాలని సూచించారు. లేకపోతే తమ పిల్లల భవిష్యత్తుకు ఇబ్బందిగా మారుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు చంగయ్య, గౌరీశంకర్, సుమంత్, హరి, బబ్లు పాల్గొన్నారు.

వైసిపి అరాచకాలను తిప్పికొట్టాలి

-'నిజం గెలవాలి'లో భువనేశ్వరి

ఓబుల్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న భువనేశ్వరి

ప్రజాశక్తి-కలసపాడు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసే నియంతృత్వ పరిపాలనను, అరాచకాలను ప్రజలు ఓటు అనే ఆయుధం ద్వారా తిప్పి కొట్టాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందిన బి.కోడూరు మండలంలోని గుంటపల్లికి చెందిన ఓబుల్‌రెడ్డి, కలసపాడు మండలంలోని లింగారెడ్డిపల్లెకు చెందిన సగిలి డేవిడ్, బ్రాహ్మణపల్లెకు చెందిన నల్లగుండ్ల వెంకటయ్య, తెల్లపాడుకు చెందిన బసిరెడ్డి చెంచిరెడ్డి కుటుంబ సభ్యులను శుక్రవారం భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ గడచిన నాలుగున్నర సంవత్సరాల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పైన వైసిపి కార్యకర్తలు దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్యకర్తలకు సముచిత న్యాయం చేస్తామన్నారు. బడుగు బలహీన వర్గాల వారికి, సంక్షేమ పథకాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు రితీష్ రెడ్డి, కలసపాడు మండల తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి అభ్యర్థి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బొజ్జా రోషన్న, మాజీ జడ్‌పిటిసి భూపాల్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సాధనకారి రంతు, కలసపాడు మండల అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షులు పట్టాభిరెడ్డి, బిసి సెల్ మండల అధ్యక్షులు మల్లికార్జున, రోషిరెడ్డి, భద్రయ్య, రామాంజనేయరెడ్డి, చిరంజీవి, మాజీ సర్పంచులు బాల వెంకట్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు రంగారెడ్డి, లింగారెడ్డిపల్లి ఆర్మీ మస్తానయ్య, చెన్నారెడ్డి పల్లె టిడిపి నాయకులు శేఖర్, రెడ్డి బాలుడు, బాబు, వెంగయ్య, బాలరాజు, ఓబులేసు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-కలికిరి

ఎన్నికల నియమ నిబంధనలను అనుసరించాలని ఎస్‌పి బి.కృష్ణారావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండలంలోని పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డుల పరిశీలించారు. అనంతరం ఎన్నికల నియమ నిబంధనలు నియమావళిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించవలసిన నియమ నిబంధనలను తెలియజేశారు. అనంతరం పోలింగ్ బూత్‌లను తనిఖీ చేసి అక్కడ తీసుకోవాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ కూడా మండలంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు సజావుగా జరిగేటట్లుగా చూడాలని ఆదేశించారు. వాహనాల తనిఖీ, త్రిబుల్ రైడింగ్, నగదు బదిలీపై నిషేధం లాంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐ ఆర్ మోహన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గడికోట

ప్రజాశక్తి-సంబేపల్లె (రాయచోటి)

ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరిసే మాసం రంజాన్ అని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సంబేపల్లె మండలం శెట్టిపల్లెలో శుక్రవారం మాజీ జడ్‌పిటిసి గొర్ల ఉపేంద్రారెడ్డి, గొర్ల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు చిదంబర్‌రెడ్డి, లక్ష్మీకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, శివారెడ్డి, సర్పంచ్ వెంకటరమణ నాయక్, మండల జెసిఎస్ కన్వీనర్ వడ్డీ వెంకట రమణారెడ్డి, వాయల్పాటి ఆనంద కుమార్‌రెడ్డి తదితర నాయకులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసంలో దైవ చింతనతో పాటు నియమబద్ధ జీవితం గడపడం వల్ల క్రమశిక్షణ, సానుభూతి, ఓర్పు, సేవా భావం వంటి సద్గుణాలు అలవడుతాయన్నారు. ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొనే ఆత్మ స్థైర్యం పెంపొందుతుందన్నారు. శుభాలు వర్షించే మాసం రంజాన్ అని తెలిపారు. పేదవాడి ఆకలి విలువ తెలుసుకోవడమే రోజా ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ముస్లిం సోదరులకు శ్రీకాంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ సేన్ వెంకట్రామిరెడ్డి, గొర్ల అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎంపిపి నాగిరెడ్డి, వైస్ ఎంపిపి పొత్తూరి రవీంద్ర నాయుడు, బిసి సెల్ నియోజక వర్గ కన్వీనర్ నాగరాజు యాదవ్, సర్పంచ్ లు పాల వెంకట రమణనాయుడు, దండు నాగభూషణరెడ్డి, ఎంపిటిసిలు శ్రీధర్‌రెడ్డి, రఘు, నాయకులు జాకీర్, నౌషాద్, బాబాసాబ్, సయ్యద్ బాష పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న శ్రీకాంత్‌రెడ్డి

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజా రవాణా అధికారి రాము

చలివేంద్రం ఏర్పాటు ప్రశంసనీయం

- జిల్లా ప్రజా రవాణాధికారి రాము

ప్రజాశక్తి-పీలేరు

వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని అన్నమయ్య జిల్లా ప్రజా రవాణాధికారి రాము అన్నారు. శుక్రవారం పీలేరు బస్టాండ్ ప్రాంతంలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆర్ఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు, మదనపల్లి బస్టాండుల్లో ఉచిత తాగునీటి సౌకర్యం కల్పించడానికి ముందుకొచ్చిన దాతలకు సంస్థ తరపున స్థలం కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రజా రవాణా, కార్గో, ఇతర సేవలు అందించడంలో రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా 20వ స్థానంలో ఉందని చెప్పారు. జిల్లాలో మదనపల్లి-2వ డిపో మొదటి స్థానం, పీలేరు డిపో ద్వితీయ స్థానంలోను, రాయచోటి డిపో చివరి స్థానంలో ఉన్నాయని తెలియజేశారు. కార్గో సేవలు, ఆదాయంలోనూ ఈ రెండు డిపోలు మంచి ఫలితాలు అందిస్తున్నాయని చెప్పారు. మదనపల్లి-2 డిపో ప్రథమ స్థానంలో ఉండడానికి అక్కడి ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల్లో ఐక్యత, మెరుగైన పని విధానమే అందుకు కారణమని అన్నారు. అదే స్ఫూర్తితో మిగిలిన డిపోల్లోనూ ఉద్యోగ, సిబ్బంది సంస్థ ఆదాయాభివృద్ధికి అన్ని విధాలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బండ్ల కుమార్ సిఐ సుబ్బమ్మ, ఇతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలి

ప్రజాశక్తి-రాయచోటి

కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని దించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలపరచాలని బలపరిచి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలని ఎపిసిసి డెలిగేట్ ఎస్‌పిఎండి గౌస్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మోడీ ప్రధానిగా వచ్చినప్పటి నుండి ప్రజలు అధిక ధరలతో ఇబ్బంది పడుతు న్నారన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేసుకోవాలని తెలిపారు. ప్రతి కార్యకర్త కష్టపడి రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలపరచాలని కోరారు.

30న కడపలో చంద్రబాబు రోడ్ షో

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు రోడ్ షోలో భాగంగా ఈ నెల 30న జిల్లాకు రానున్నారు. జిల్లాలోని మైదుకూరు, ప్రొద్దుటూరు నియోజవర్గాలలో రోడ్ షో నిర్వహిస్తారు. మైదుకూరులో ప్రజాగళం నిర్వహిస్తారు. ప్రొద్దుటూరులో బహిరంగ సభలో పాల్గొంటారని టిడిపి నాయకులు వెల్లడించారు.

కేజ్రీవాల్ అరెస్టు దారుణం : పిసిసి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షులు కేజ్రీవాల్ అరెస్టు దారుణమని పిసిసి అధికార ప్రతినిధి పూల భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడడంతో ఇండియా కూటమిని ఎదుర్కొనే శక్తి లేక బిజెపి అధికార దుర్వినియోగానికి పాల్పడి, ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించిందని పేర్కొన్నారు. పలువురు ముఖ్యమంత్రులు తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, వారిపై అనేక కేసులు నమోదయ్యాయని తెలిపారు. కేజ్రీవాల్ అరెస్టులో వేగంగా ప్రభుత్వ యంత్రాంగం కదిలిందని, మిగిలిన ముఖ్యమంత్రుల విషయంలో ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు. బిజెపి ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా ఇండియా కూటమి ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న బిజెపికి ప్రజా కోర్టులో పరాజయం తప్పదన్నారు. కేజ్రీవాల్ అరెస్టు తొందరపాటు చర్యని, అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు.

ముస్లింల సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తాం : టిడిపి

ప్రజాశక్తి-పీలేరు

ముస్లింల సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం, జనసేన గెలుపుతోనే సాధ్యమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గం బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి తెలిపారు. శుక్రవారం పీలేరులో జరిగిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పీలేరు ముస్లింల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ అందించిన సంక్షేమ పథకాలు రద్దుచేసి వైసిపి మోసం చేసిందని ఆరోపించారు. స్థానిక ముస్లింలు వచ్చే ఎన్నికల్లో వైసిపికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ముస్లింల కోసం తెలుగుదేశం ప్రభుత్వం అడబిడ్డలకు దుల్హన్ పథకం, యువత స్వయం ఉపాధి కోసం దుకాన్ ఔర్ మకాన్, రంజాన్ తోఫా, హజ్ యాత్రికులకు ప్రత్యేక భవనాలు, ఇమామ్, మౌజన్లకు జీతాలు, స్మశాన వాటికలకు ప్రహరీ నిర్మాణాలు, దర్గాల మరమ్మతులు, 648 వక్ఫ్ సంస్థలకు గ్రాంట్, ఇన్ ఎయిడ్ కింద రూ.50 కోట్లకు పైగా నిధులు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన ఐదేళ్లల్లో అన్నీ అర్థాంతరంగా ఆగి పోయాయని, తెలుగు దేశం, జనసేన అధికారంలోకి రాగానే వాటన్నిటినీ పునరుద్ధరించి, ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేసి డ్వాక్రా సంఘాల తరహాలో వడ్డీలేని రుణాలు అందించి, ముస్లిం మైనారిటీలకు మరిన్ని సంక్షేమపథకాలతో అన్ని విధాలా ఆదుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీల హక్కుల సాధనకై, ప్రతి ఒక్కరూ కిషోర్ కుమార్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు, నల్లారి అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న నల్లారి తనుజారెడ్డి

ప్రచారంలో పాల్గొన్న సుధీర్ కుమార్‌రెడ్డి

ఆదరించండి అభివృద్ధి చేసి చూపుతాం

ప్రజాశక్తి-పీలేరు

వైసిపి ప్రభుత్వాన్ని ఆదరించి జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడపడానికి అందరం తోడ్పాటు అందిద్దామని పీలేరు, కెవి పల్లి మండలాల వైసిపి ఎన్నికల బాధ్యులు పెద్దిరెడ్డి సుధీర్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పద్మావతి నగర్‌లోని పలు వీధుల్లో గడప గడపకూ తిరిగారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలు గురించి ప్రజలకు వివరించారు. వైసిపి నుంచి రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గానికి మూడోసారి ఎంపీగా పోటీ చేయనున్న ప్రస్తుత ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి, పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డిలను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి.శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా పంచాయితీ రాజ్ అభివృద్ధి మండలి సభ్యులు డాక్టర్ షేక్ హబీబ్ బాష, పంచాయతీ సర్పంచ్ షేక్ జీనత్ షఫీ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి హుమయూన్, జిల్లా పర్యాటక శాఖ అభివృద్ధి మండలి సభ్యులు షాకీర్, కడప గిరిధర్‌రెడ్డి, వైస్ ఎంపిపిలు పెద్దోడు, ఎంవి చలపతి, ఉదయ్ కుమార్, మునీర్, ఆబిద్, హబీబ్, విజయ్ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు వైవీయూ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం 18వ వ్యవస్థాపక దినోత్సవం, కళాశాల ఉత్సవం ఈ నెల 23న క్యాంపస్‌లోని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం సెంట్రల్ లైబ్రరీ భవన ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైవీయూ విసి చింతా సుధాకర్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. తిరుపతి ఎస్‌వి యూనివర్శిటీ విసి శ్రీకాంత్ రెడ్డి, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ విసి ఆంజనేయ ప్రసాద్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. న్యూఢిల్లీ ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ వై. సురేష్ రెడ్డి ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. గౌరవ అతిథిగా వైవీయూ రిజిస్ట్రార్ వై.పి. వెంకటసుబ్బయ్య రానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్, అకడమిక్ కన్సల్టెంట్స్, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు.

నేడు 'కామోత్సవ దహనం' పుస్తకావిష్కరణ సభ

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఈదర గోపీచంద్ రచించిన 'కామోత్సవ దహనం' పుస్తకావిష్కరణ సభ నిర్వహిస్తున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేశ్ బాబు తెలిపారు. పుస్తకావిష్కరణ సభకు అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. యుగ కవి శేషేంద్రలి రాసిన మొదటి, చివరి వివాదాస్పద అశ్లీల సీరియల్ పై ఏడేళ్ల పాటు అనేక ప్రజా సంఘాలు జరిపిన న్యాయ, సాహితీ, ప్రజా, నైతిక పోరాటాల సచిత్ర చరిత్ర పుస్తకం అన్నారు. అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా వచ్చిన రచనలపై చర్చ ఉంటుందని వివరించారు. అశ్లీలతా ప్రతిఘటన వేదిక ప్రతినిధులు హాజరయ్యే ఈ కార్యక్రమానికి ప్రజా సంఘాల సభ్యులు, సాహితీ వేత్తలు, సాహితీ ప్రియులు హాజరుకావాలని కోరారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	షహారీ
శనివారం (సా)	ఆదివారం (ఉ)
6.30	5.03

పిల్లలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్‌ను వేస్తున్న వైద్య సిబ్బంది

పిల్లలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్ పంపిణీ

ప్రజాశక్తి-కలకడ

ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్‌ను పంపిణీ చేసినట్లు ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎంవి.కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రతి ఆరోగ్య ఉప కేంద్రాలకు 50 బాటిళ్ల చొప్పున సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ఒక బాటిల్ 60 మిల్లీ లీటర్లు ఉంటుందని, ఐఎఫ్ఎ సిరప్ పిల్లలకు రక్తహీనత నుండి కాపా డుతుందని అన్నారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి బుధ, శనివారాలలో రెగ్యు లర్, అవుట్ రిచ్ సెషన్లలో ఐఎఫ్ఎ టానిక్‌నూ పిల్లర్ ద్వారా తప్పక ప్రతి బిడ్డకు ఒక యం.ఎల్. చొప్పున వేయాలని సూచించారు. బిడ్డకు ఆరు మాసాల నుంచి ఐదు సంవ త్సరాల వరకు వేయాలని, ఐరన్ సిరప్‌ను పిల్లలకు వేసిన వెంటనే యంసిపి కార్డులో నమోదు చేయాలని అన్నారు. ప్రతి బిడ్డ పెరుగుదలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా కార్డులో గుర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య. స్టాఫ్ నర్స్ జయభారతమ్మ. పిహెచ్ఎన్. కె.సుబ్బరత్న, సూపర్వైజర్ బి. రెడ్డమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందిస్తున్న జ్యోతిశ్వర్ నాయుడు

నిత్యావసర సరుకులు వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని లేబాకువారిపల్లె గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుల సమైక్య సంఘం సభ్యుడు జ్యోతిశ్వర్ నాయుడు తండ్రి మారోతు చలమయ్య, గురవయ్య వర్ధంతి సందర్భంగా విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సమైక్య సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బ నరసారెడ్డి ఆధ్వర్యంలో నిరుపేదలైన విభిన్న ప్రతిభావంతుల కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా జ్యోతిశ్వర్ మాట్లాడుతూ తన తండ్రి మరణిం చిన రోజు సందర్భంగా నిరుపేదలైన విభిన్న ప్రతిభావంతుల కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. కార్య క్రమంలో రాజంపేట అధ్యక్షులు అబ్దుల్‌ఖాదర్, పివి పిఎస్ఎస్ కోశాధి, కారి నరసింహులు, రాజంపేట ఉపాధ్యక్షుడు ఖాదర్‌బాషా, వెంకటప్రసాద్ పాల్గొ న్నారు.

టిడిపి నూతన కార్యాలయంలో ముక్కా రూపానందరెడ్డి, కుటుంబ సభ్యులు

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని రాఘవరాజుపురం వద్ద హెచ్‌పి పెట్రోల్ బంక్ ఎదురుగా నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానంద రెడ్డి ఆయన సతీమణి వరలక్ష్మి నూతన టిడిపి కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. రూపానందరెడ్డి టిడిపి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టడంతో తనకంటూ ఒక పార్టీ కార్యాలయం ఉండాలనే ఉద్దేశంతో పార్టీ కార్యాలయాన్ని పారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఉమ్మడి అభ్యర్థిని ఎన్నికలలో గెలిపించేందుకు తాను అహర్నిశలు పార్టీ కోసం పని చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, రూపానందరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గణితం పరీక్షకు 51 మంది గైర్హాజర్

ప్రజాశక్తి-కలికిరి

పదవ తరగతి గణితం పరీక్షకు 51మంది గైర్హాజరైనట్లు ఎంఇఒ కరీ ముల్లా తెలిపారు. శుక్రవారం మండలంలో ప్రభుత్వ హైస్కూలు, బాలికల ఉన్నత పాఠశాల, మహల్ జడ్‌పి హైస్కూల్‌లో పరీక్షలు జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు బాగా చదివి అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణత కావాలని సూచించారు.

టిడిపి నాయకులతో మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

టిడిపి గెలుపునకు సహకరించండి :'మండిపల్లి'

ప్రజాశక్తి-రామాపురం

రాయచోటి అసెంబ్లీ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మండ లంలో విస్తృతంగా పర్యటించారు. తన కుమారుడు నిఖిల్ నాగిరెడ్డితో కలిసి మండలంలోని రాచపల్లి, కల్పనాయునిచెరువు, చిట్లూరు, గంగనేరు, వడ్డేపల్లి, నాయన వారిపల్లి, బాల్‌రెడ్డిగారిపల్లి, అగ్రహారం, ఊరమాదిగపల్లి గ్రామాల్లో పర్యటించారు. టిడిపి నాయకులు, కార్య కర్తలతో కలిశారు. ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. సూపర్ సిక్స్ పేరుతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ అధిష్టానం తనను అభ్యర్థిగా ప్రకటించిందని, తన గెలుపునకు సహకరించి అండగా నిలవాలని ఆయన స్థానిక నాయ కులు, కార్యకర్తలను కోరారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, కదిరి
O.S.NO:33/2021
Between:
కొండన్న గారి విజయలక్ష్మి W/o దేవల రెడెప్ప, స్టాఫ్ నర్సు కదిరి, కదిరి మండలం,శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది
మరియు
కొండన్న గారి లక్ష్మి ప్రసాద్ S/o కె.నరసింహులు, డోర్ నెం:1-797, మెయిన్ రోడ్డు, నియర్ మకనా, తరిగేండ (పోస్టు) గుర్రమ్‌కొండ మం, అన్నమయ్య జిల్లా. ...ప్రతివాది
<u>ప్రతివాది దావా సమను</u>
పై దావాలో పై కోర్టు వారు మీ హాజరు నిమత్తం 28/03/2024 వ తేదిన వాయిదా వేసినారు. కావున మీరు 28/03/2024 వ తేదిన ఉదయం 10:30 గం॥లకు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయుదురని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:28/03/2024
స్థలం:కదిరి
పి.వి.శివప్రసాద్, B.Com., B.L,
వాదితరుపు వకీలు, కదిరి.

అభివృద్ధిని చూసే వైసిపిలోకి చేరికలు : ఎమ్మెల్యే

వైసిపిలో చేరిన జనసేన, టిడిపి నాయకులతో ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే టిడిపి, జనసేన పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు వైసిపిలోకి చేరుతున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో మండలంలోని ఎద్దులవారిపల్లి, దండు వారిపల్లిలో టిడిపి మాజీ మండల కన్వీనర్ అమర్నాథ్ రెడ్డి, మల్లయ్య కొండ మాజీ చైర్మన్ శ్రీనివాసులు, జనసేన నుంచి రేణుమాకులపల్లి మాజీ సర్పంచ్ సాంబశివరెడ్డిలు వైసిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి వైసిపి కండువా కప్పి ద్వారకనాథ్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపిని ఓడించేందుకు కూటమిగా ఏర్పడి పన్నాగాలు పడుతున్నారని అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా వైసిపి విజయాన్ని అడ్డుకోలేరని అన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలే అండగా ఉన్నారని వారే ఆయనను మరల ముఖ్యమంత్రిని చేస్తారని చెప్పారు. తాము చేసిన అభివృద్ధి చూసి ప్రజలను ఓట్లు అడుగుతామని, చేసిన అభివృద్ధే మమ్మల్ని గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయానికి తామంతా సమిష్టిగా పనిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ల క్లైములు పరిశీలన : తహశీల్దార్

ప్రజాశక్తి-కలకడ

ఓటర్ల క్లైమూలను పరిశీలిస్తున్నట్లు తహశీల్దార్ ప్రియదర్శిని పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఫామ్-6 గురించి వివరించి, నూతనంగా ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ఓటర్లుగా నమోదు చేసుకోని వ్యక్తులు 18 సంవత్సరాలు నిండినవా లేవా అని పరిశీలించేందుకు వారి ధ్రువీకరణ పత్రాలను, ఆధార్ కార్డులను పరిశీలించి ఓటర్లుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటర్లుగా నూతనంగా నమోదు చేసుకునే పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి సక్రమంగా ఉన్నాయా లేదని చూడాల్సిన బాధ్యత విఆర్‌ఒలపై ఉందని గుర్తు చేశారు. నూతనంగా ఓటర్లు నమోదు చేసుకునే వారికి వచ్చేనెల 14 వరకు నమోదు చేసుకోవచ్చని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సాంబశివ, విఆర్‌ఒలు మస్తాన్, రెడ్డిశేఖర, ఆంజనేయులు, రవిచంద్రన్, రామకృష్ణ, అనంతరాజు పాల్గొన్నట్లు తెలిపారు.

విఆర్‌ఒలకు సూచనలు ఇస్తున్న తహశీల్దార్ ప్రియదర్శిని

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్వైజర్లు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని ఐసిడి ఎస్ సూపర్వైజర్లు యశోద, గుణవతి, వెంకటరత్నమ్మ పేర్కొన్నారు. సిడిపిఒ టిపి సౌభాగ్యమ్మ ఆదేశాలతో రైల్వే కోడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల కోడూరు సెక్టార్ లోని ఉంగరాలనగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వ హించారు. చిరుధాన్యాల విశిష్టత, తల్లిపాల ప్రాముఖ్యత, పిల్లలలో పెరుగుదల పర్య వేక్షణకు గురించి సూపర్వైజర్లు అవగాహన కల్పించారు.గర్భిణులు క్రమతప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. తల్లీబిడ్డ ఎదుగుదలకు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని చెప్పారు. అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని గడికోట పంచాయతీ యడపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఎడబల్లి గంగమ్మ, పోతులరాజు, ప్రాణ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజలు సహకారంతో విశ్రాంత జస్టిస్, విద్యుత్‌శాఖ నియంత్రణ మండలి చైర్మన్ చింతల వెంకటనాగార్జునరెడ్డి, ఆయన సతీమణి శోభమ్మల ఆధ్వర్యంలో రూ.80లక్షల వ్యయంతో గంగమ్మ నూతన ఆలయాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమానికి జడ్‌పి చైర్మన్ అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, వైసిపి యువ నాయకుడు విజయసాగర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఇ, డిఇ, ఎఇ ప్రముఖ పారిశ్రామిక వేత్తలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. పురోహితులు, వేద పండితులు, ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, కలశార్చన, హోమాలు, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహా మంగళ హారతి నిర్వహించారు. అనంతరం వైభవంగా శివపార్వతుల కల్యాణం జరిపించారు.. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆలయ నిర్మా ణం కోసం స్థానికులు తమవంతు సాయం అందించారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన పెద్ద లందరికీ నాగార్జునరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. హాజరైన ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కల్యాణోత్సవంలో పాల్గొన్న నాగార్జునరెడ్డి దంపతులు

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

రెవెన్యూ సిబ్బందితో కలిసి ర్యాలీలో పాల్గొన్న తహశీల్దార్ విజయకుమారి

ప్రజాశక్తి-కలికిరి

ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ విజయకుమారి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల కలికిరిలో విద్యార్థులకు ఓటుహక్కు పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటుహక్కు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. భాధ్యత గల ప్రతి పౌరులు తప్పక ఓటు వేయాలని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 18 సంవత్సరాల నుంచి ప్రతి ఒక్క పౌరుడు ఓటు సద్వినియోగం చేసుకొని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి ప్రజలందరికీ తమ ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

లింగనిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ సిడిపిఒ రాజేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్‌లో భేటీ బచావో బేటి పడావోలో భాగంగా జమ్మలమడుగు, గూడెం చెరువు సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ మాట్లాడుతూ బాలలకు సంబంధించిన చట్టాల పైన ప్రతి అంగన్వాడీ కార్యకర్త అవగాహన కలిగి ఉండాలన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించడం నేరమని చెప్పారు. వీటిని ప్రోత్సహించినా, లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నా చేసిన వారు శిక్షార్హులు అవుతారని తెలియజేశారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేష్ మాట్లాడుతూ పిల్లలు, మహిళల రక్షణ కోసం ఉన్నటువంటి హెల్ప్ లైన్ నెంబర్స్ పై అవగాహన కల్పించడంతోపాటు గ్రామస్థాయిలో ఉన్న అడల్ట్ పిల్లల డేటాను ప్రతి అంగన్వాడి సెంటర్లో కలిగి ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, గౌసియా, బిపిసి రమేష్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **చెన్నూరు :** బాల బాలికల చదువులను ప్రోత్సహించి సమాజాభివృద్ధికి దోహదపడాలని అంగన్వాడీ సూపర్‌వైజర్లు నాగరత్నమ్మ, గుర్రమ్మ అన్నారు, జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు శ్రీ లక్ష్మి ఆదేశాల మేరకు బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా చింతకొమ్మదిన్నె ఐసిడిఎస్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు ప్రాజెక్టు పరిధిలోని చెన్నూరు అంగన్వాడీ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ విభాగం లీగల్ అధికారి పిఆర్ సునీత రాజు, ఒఆర్‌డబ్ల్యు ప్రసన్న లక్ష్మి, ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు దూరంగా ఉంచండి

కడప అర్బన్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నియోజవర్గానికి, సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి, డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి కోరారు. శుక్రవారం ద్వారాక నగర్‌లోని శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఇద్దరి అధికారులను గుప్పెట్లో పెట్టుకుని ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నారని పేర్కొన్నారు. పోలీసులు టిడిపి అభ్యర్థులపై మాత్రమే కేసులు పెడుతున్నారని చెప్పారు. రెవెన్యూశాఖ ద్వారా ఇబ్బందులు సృష్టిస్తున్నారని తెలిపారు.ఎంఎల్‌సి అనంత బాబు వ్యక్తిని చంపి డోర్ డెలివరీ చేశారని చెప్పారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇతర రాష్ట్రాలకు చెందిన అధికారులను ఇక్కడ వేయాలని కోరారు.

25న కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

కడప : ఈనెల 25న సాయంత్రం కడప జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కడపలోని ఆమీన్ ఫంక్షన్ ప్యాలెస్‌లో ఇఫ్తార్ విందు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి అన్నారు. ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్. షర్మిల రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. షర్మిలారెడ్డి పర్యటన సందర్భంగా ఆయన ఇఫ్తార్ విందు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాటా్లడుతూ రంజాన్ ముస్లిముల పవిత్ర పండుగ అని, రంజాన్ మాసంలోనే పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరించిందని చెప్పారు. ఇలా చేయడం వల్ల కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అదుపులో ఉంటా యని అన్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, పిసిసి ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, కడప నగర కాంగ్రెస్ అధ్యక్షులు విష్ణు ప్రితమ్ రెడ్డి, సంఘ సేవకుడు సలావుద్దీన్, లయన్ పి.ఖాసింఖాన్, ఆడిటర్, మాజీ డిప్యూటీ మేయర్ అరిపుల్ల సుజాత్ అలీఖాన్, అష్రఫ్ అలీఖాన్, ఖాదం బాషా, మోపూరు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

అఫ్జల్ జహాకు డాక్టరేట్

కడప : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉర్దూ విభాగ పరిశోధక సి.అఫ్జల్ జహాకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఉర్దూ విభాగ ఆచార్యులు డాక్టర్ అమీనుల్లా ఆధ్వర్యంలో 'ఖవాతినే రాయసీమకి ఆదబి కిద్మత్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు అఫ్జల్ జహాను డాక్టరేట్ వరించిందని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం. దామ్లా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఉర్దూ విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థిని విద్యార్థులతో పాటు కడప నగర సాహితీవేత్తలు, తండ్రి అమీర్ బాష, తల్లి గౌసియా బేగం విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు.

26న శ్రీఈశ్వరీదేవి మఠంలో బహిరంగ వేలం

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

బ్రహ్మంగారి మఠంలో వెలసిన శ్రీఈశ్వరీదేవిమఠంలో అమ్మవారి చీరలు, మరుగుదొడ్ల నిర్వహణ రుసుం వసూలు చేయడానికి ఈనెల 26 బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు శ్రీ ఈశ్వరి దేవి మఠం కార్యనిర్వహణ అధికారి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. ఈఏడాది ఏప్రిల్ 1 నుంచి ఏడాదిపాటు మాత్రమే హెచ్చు పాటదారుడికి హక్కులుంటాయన్నారు. మరుగుదొడ్ల వేలం ప్రకటనకు డిపాజిట్ రూ. 30 వేలు, అమ్మ వారి చీరల వేలం పాటకు డిపాజిట్ రూ. 20 వేలు నగదు చెల్లించాలన్నారు. వేలం పాట సమయం మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తారన్నారు.

పరీక్ష కేంద్రం వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ రఘురాం

'పది' పరీక్ష కేంద్రాల వద్ద భద్రత పటిష్టం : ఎస్ఐ

ప్రజాశక్తి-పుల్లంపేట

పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టామని ఎస్ఐ రఘురాం పేర్కొన్నారు. శుక్రవారం పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి పోలీస్ బందోబస్తుతో పాటు పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎటువంటి జిరాక్స్ సెంటర్లు, చిల్లర కొట్టు దుకాణాలు మూసి వేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎక్కువమంది గుమికూడ వద్దని తెలిపారు. పరీక్షలు జరిగే సమయంలో పోలీస్ సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ అమర కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నీటి వినియోగంపై అవగాహన కరపత్రాలను చూపుతున్న విద్యార్థులు

నీటి వృథాను అరికట్టాలి

ప్రజాశక్తి-కలికిరి

నీటి వృథాను అరికడితేనే భావితరాలకు భవిష్యత్తు ఉంటుందని సైన్స్ ఉపాధ్యాయురాలు అరుంధతి పిల్లలకు సూచించారు. అంతర్జాతీయ నీటి దినోత్సవం పురస్కరించుకొని కలికిరి ఇందిరమ్మ హై స్కూల్లో విద్యార్థులకు నీటి వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పోస్టర్లు విడుదల చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నీటి వినియోగంపై, మానవులకు నీరు ఏ విధంగా ఉపయోగపడుతుంది, రైతులు వ్యవసాయానికి నీటిని ఏ విధంగా ఉపయోగిస్తారు, తద్వారా మనకు కలిగే లాభాల గురించి తెలియజేశారు. నీటిని సరైన క్రమంలో వాడుకుంటేనే రాబోవు తరాల వారికి భరోసా కలిగించ గలుగుతామని అన్నారు. అదే నీటిని వృథా చేస్తే భావితరాల మనుగడ సాగదని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు సహదేవ, ఉపాధ్యాయులు వరప్రసాద్, ఉషారాణి, రఘు, ముబారక్ ఖాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హరికథ చెబుతున్న కౌసల్య

అలరించిన హరికథ కాలక్షేపం

ప్రజాశక్తి-కలకడ

హరికథ కాలక్షేపం భక్తులను ఆకట్టుకుని అలరించింది. మండలంలోని దేవళంపేటలో వెలసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 21 నుంచి ప్రారంభమైన మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం భీష్మ జననం ప్రతిజ్ఞ హరికథ కాలక్షేపాన్ని భాగవతారని కౌసల్య కథను వినిపించారు. రాత్రికి కురుపాండవ జననం నాటకం ఉన్నట్లు మహాభారత యజ్ఞం నిర్వాహకులు రామయ్య , మద్దిపట్ల వెంకట రమణ నాయుడు తెలిపారు.

క్రైం కార్నర్

మద్యం బాటిళ్లతో నిందితుడి అరెస్టును చూపుతున్న ఎస్ఐ

40 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-కలకడ

40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన కలకడ బస్టాండ్ సమీపంలో మద్యం బాటిళ్లు కలిగి ఉన్నట్లు ముందస్తు సమాచారం అందడంతో తన సిబ్బందితో తనిఖీలు చేసినట్లు తెలిపారు.ఈ తనిఖీలలో కేవీపల్లి మండలం ఎంవి.పల్లి పంచాయతీ చీనేపల్లికి చెందిన పాపన్న గారి గంగయ్యను అను మానితుడిగా గుర్తించి, తనిఖీలు నిర్వహించగా, అతని వద్ద 40 మద్యం బాటిళ్లను గుర్తించినట్లు చెప్పారు. బాటిళ్లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.ఈ దాడులలో హెడ్ కానిస్టేబుల్ హరి, జీప్ డ్రైవర్ రమేష్ పాల్గొన్నారు. **గాలివీడు:** గేటు నాలుగు రోడ్ల కూడలి వద్ద 11 మద్యం బాటిళ్లు అక్రమంగా కలిగివున్న అరవీడు శ్రీనగర్‌కు చెందిన పుల్లగంటి గణేష్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద ఓ వ్యక్తి అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉన్నాడనే సమాచారం మేరకు తన సిబ్బందితో దాడులు చేశామని చెప్పారు. గణేష్ అనే వ్యక్తిని అదుపులోకి విచారించగా మద్యం బాటిళ్లు లభ్యమైనట్లు తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు. అక్రమంగా మద్యం బాటిళ్లు, నాటు సారా కలిగివుంటే సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు..మొలకలచెరువు మండలం, బురకాయలకోట పంచాయతీ, బలకవారిపల్లికి చెందిన సుదర్శన్‌రెడ్డి కుమారుడు జశ్వంత్‌రెడ్డి(19) మదనపల్లిలో ఇంటర్ చదవుతున్నాడు. జశ్వంత్ రెడ్డి మంగళవారం తన బైకులో బలకవారిపల్లి నుంచి బుర కాయలకోటకు సొంత పనిపై వెళ్తుండగా మార్గ మధ్యంలోని సెంట్రల్ స్కూల్ వద్ద వాహ నం ఢీకొని తీవ్రంగా గాయపడి ఆపస్మారక స్థితికి చేరుకొన్న విషయం తెలిసిందేనని అన్నారు. బాధితుడిని మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి బెంగుళూరు తీసుకెళ్లి వైద్యం చేయించిన ఫలితం లేకుండా పోయిందని బాధితుడి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.